

నవోదయకు వియాన్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని వియాన్ కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థి ఎల్.కౌశిక్ జవహర్ నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి అర్హత సాధించినట్లు ఆ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు జొన్నలగడ్డ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కోచింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కౌశిక్ కళ్యాణ్‌ను అభినందించారు. మండలంలోని వడాలికి చెందిన కౌశిక్ గత ఏప్రిల్ 29న దేశవ్యాప్తంగా జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు హాజరై ఉత్తీర్ణత సాధించాడు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వేలేరు గ్రామంలోని జవహర్ నవోదయ పాఠశాలలో ప్రవేశానికి అర్హత సాధించాడు. దేశవ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షకు 20 లక్షల మంది విద్యార్థులు హాజరవ్వగా 50 వేల మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలో అర్హత సాధించారని, వారిలో మండలానికి చెందిన కౌశిక్ ఉండడం గర్వకారణమని కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు.

సమస్యలు వింటూ.. కర్తవ్యం నిర్దేశిస్తూ...!

ఆరు గ్రామాల మీదుగా 19 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర


పోరుకేక బృందానికి వెల్లువెత్తిన సంఘీభావం

అడుగడుగునా ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

అంతా కలిసికట్టుగా పోరాడుతామని సభల్లో నేతల పిలుపు


ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/కుక్కునూరు/ జీలుగుమిల్లి/బుట్టాయగూడెం

నిర్వాసితుల సమస్యలను ఆలకిస్తూ.. కర్తవ్యం నిర్దేశిస్తూ జిల్లాలో రెండోరోజు మంగళవారం ఆరు గ్రామాల మీదుగా 19 కిలోమీటర్ల మేర పోలవరం పోరుకేక మహాపాదయాత్ర సాగింది. ఉదయం ఎనిమిది గంటలకు కుక్కునూరు మండలం దాచారంలో యాత్ర ప్రారంభమైంది. పది గంటలకు మండల కేంద్రమైన కుక్కునూరు చేరుకుంది. ఈ బృందానికి టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు సంఘీభావం తెలుపుతూ స్వాగతం పలికారు. టిడిపి నాయకులు మునిశెట్టి నాగు, జనసేన నాయకులు మునిశెట్టి యుగంధర్



సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

వి.శ్రీనివాసరావుకు నిర్వాసితుల సమస్యలను వివరించారు. స్థానిక నిర్వాసితులు ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నారో.. పరిహారం అందకపోవడం, ఇళ్లు నిర్మించకపోవడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం జరిగిన సభలో వీరంతా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ కుక్కునూరు చేరుకుని పాదయాత్ర బృందానికి


పాదయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

సంఘీభావం తెలపడమే కాకుండా రోజుంతా పాదయాత్రలో పాల్గొన్నారు. మధ్యాహ్నం జీలుగుమిల్లి మండలంలోని రాచన్నగూడేనికి యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో పలువురు నేతలు ప్రసంగించారు.

ముంపులో లక్షా ఐదు వేల కుటుంబాలు
మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

పోలవరంలో ముంపునకు గురవుతున్న ఎనిమిది మండలాల్లో దాదాపు లక్షా ఐదు వేల కుటంబాలు నిర్వాసితులవుతున్నాయని మంతెన సీతారాం తెలిపారు. చెట్టుకొకరు.. పుట్టకొకరు అన్నట్లుగా వారి పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన వారికి పునరావాస పరిహారం, వ్యవసాయ కూలీలకు ప్యాకేజీ, కుటుంబానికో ఉద్యోగం ఇవ్వాల్సి ఉందన్నారు. సిఎం జగన్ మాత్రం ఏమీ చేయడం లేదన్నారు. రాచన్నగూడెం పోరాటాల గడ్డ అని, నిర్వాసితులకు అండగా నిలవాలని అన్నారు. మనం ఎకరా భూమి పోతే చాలా బాధపడతామని, నిర్వాసితులు సర్వం కోల్పోతున్నారని అన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం చేస్తూ నిర్వాసితులను ముంచేస్తున్నారన్నారు. గతేడాది వచ్చిన గోదావరి వరద మోడీ, జగన్ తెచ్చిందేనన్నారు. మళ్లీ వరదలు వచ్చే అవకాశం ఉందని, ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది మాదిరి అడవులు, కొండల పాలు చేయకుండా వెంటనే పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని, వరద పరిహారం ఇవ్వాలని కోరారు.

బతికేందుకు దారి చూపేందుకే పోరుకేక
డి.రమాదేవి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

పోలవరం పోరుకేక పాదయాత్ర మణులు, మాణిక్యాల కోసం జరగడం లేదని, నిర్వాసితులు బతికేందుకు దారిచూపాలని కోరుతుందని డి.రమాదేవి అన్నారు. లక్షల కుటుంబాలను ముంచి ఎవరికి నీరిస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టు బాధ్యత మాది అని చెప్పిన కేంద్రం పూర్తిగా నిధులివ్వడం లేదన్నారు. కేంద్రంలో


కుక్కునూరులో వడివడిగా ముందుకు..

అమానవీయ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అడగలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. 90 శాతం హామీలు అమలు చేశామని చెబుతున్న జగన్ ముంపు మండలాల పరిస్థితి చెప్పాలన్నారు. అమ్మఒడి, వృద్ధాప్య పింఛను ఇస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. గతేడాది వరదలకు ఇక్కడి ప్రజలు దుర్భర పరిస్థితి ఎదుర్కొన్నారన్నారు. ప్రాజెక్టు కట్టి తెచ్చిన వరద అని అన్నారు. ఇప్పటి వరకూ పదిశాతం కూడా పరిహారం ఇవ్వలేదన్నారు. వచ్చేనెల నాలుగో తేదీన జరిగే సభకు అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

నిర్వాసితులకు అండగా నిలబడదాం
ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

అంతా పోలవరం నిర్వాసితులకు అండగా నిలబడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. జీలుగుమిల్లి మండలంలో నిర్వాసితులకు అత్యధిక కాలనీలు నిర్మిస్తున్నారని, వారందరికీ మనం అండగా ఉండాలని కోరారు. జాతీయ ప్రాజెక్టుగా ఉన్న పోలవరం నిర్వాసితులకు దిక్కులేదని, జీలుగుమిల్లి మండలంలో బంగారుపాపమ్మ ప్రాజెక్టు నిర్వాసితుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. జీలుగుమిల్లిలో ఆయుధ ఫ్యాక్టరీ నిర్మిస్తే జీలుగుమిల్లి, వంకావారిగూడెం పంచాయతీలు ఖాళీ చేయాల్సి వస్తుందన్నారు. దీన్ని అందరూ తిప్పికొట్టాలన్నారు. 1/70 చట్టం గిరిజనేతరులకు ఎలాంటి నష్టమూ ఉండదన్నారు. గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య విబేధాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు అధ్యక్షత వహించారు. సంఘీభావం ప్రకటించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ నిర్వాసితుల సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, అల్లూరి జిల్లా కార్యదర్శి బి.కిరణ్, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, నాయకులు తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, వాణిశ్రీ, రాంబాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నేత ప్రసన్న కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర నేత రాము, ప్రజానాట్య మండలి రాష్ట్ర నేత మంగరాజు పాల్గొన్నారు.

నా సమస్యను పాదయాత్ర దృష్టికి తెచ్చాను

మేడిపల్లి వెంకటేశ్వర్లు, కుక్కునూరు



నాకు మండలంలోని రామచంద్రాపురంలో మూడెకరాల భూమి ఉంది. ప్రతియేటా వచ్చే వరదలకు చుట్టూ నీరు చేరుతుంది. చుట్టుపక్కల భూములకు పరిహారం ఇచ్చారు. నా భూమికి పరిహారం ఇప్పించండి అని అనేకసార్లు అధికారులు, పార్టీ నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. సిపిఎం యాత్ర బృందానికి నా సమస్యను విన్నవించాను.

నిలువ నీడ లేదు.. పైసా పరిహారం లేదు

షేక్ గౌసియా, కుక్కునూరు ఎ బ్లాక్



గతేడాది వచ్చిన గోదావరి వరదలకు మా ఇల్లు కూలిపోయింది. దీంతో మేము కివ్వాక పునరావాస కాలనీలో ఏడాదిగా ఉంటున్నాం. కూలి పనులు చేసుకుంటేనే పూట గడవదు. దీంతో పడిపోయిన ఇల్లు కట్టుకునే స్తోమత లేక కాలనీలోనే ఉంటున్నాం. మాకు ప్రభుత్వం నుండి ఎటువంటి నష్ట పరిహారమూ రాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

ఇదెక్కడి అన్యాయం

కొవ్వాసి తమ్మయ్య, గిరిజనుడు, వంజంవారిగుంపు



గతేడాది వచ్చిన గోదావరి వరదలకు మా గ్రామం పూర్తిగా మునిగింది. అయితే మా గ్రామం అసలు ముంపులో లేదని అధికారులు చెబుతున్నారు. మా గ్రామం చుట్టూ ఉన్న భూములకు పరిహారం ఇచ్చారు. మా గ్రామం ముంపులో లేదంట. ఇదెక్కడి అన్యాయం. పూర్తి ముంపులో ఉన్న మా గ్రామాన్ని సర్వే జరిపి ముంపులోకి తీసుకొని పరిహారం ఇవ్వాలి.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నేతలు లోకనాథం, రమాదేవి


భోజన విరామ సమయంలో చెట్ల కింద సేదతీరుతూ..


ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్


సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

పునరావాసం పట్టదు.. పరిహారం ఇవ్వరు

వేలేరుపాడు మండలంలో నిర్వాసితుల దుస్థితి - పోలవరం పోరుకేక పాదయాత్రలో జనం గగ్గోలు - 20 శాతం కుటుంబాలకూ అందని వరద పరిహారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితులకు సంబంధించి ఎంతటి దుర్భర పరిస్థితులు ఉన్నాయో.. వేలేరుపాడు మండలంలోని ప్రజల గోడు వింటే తెలుస్తోంది. ఇప్పటి వరకూ ఏ గ్రామాలు ముంపులో ఉన్నాయి, ఏ గ్రామాలు ముంపులో లేవనే విషయాలను కూడా ప్రభుత్వం తేల్చలేకపోయింది. పునరావాసం గురించి పట్టించుకోని ప్రభుత్వం గతేడాది వరదల పరిహారం కూడా ఇవ్వని దుస్థితి నెలకొంది. మండలంలోని రుద్రమ్మకోట గ్రామంలో గత వరదలకు ఇళ్లు కూలిపోయిన వారికి నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందలేదు. 450 కుటుంబాలకుగాను 150 కుటుంబాలకే నష్ట పరిహారం అందింది. ఈ గ్రామంలోని గిరిజనులకు ఇప్పటికీ పునరావాస గ్రామం నిర్మాణం, నష్ట పరిహారంగాని అందించలేదు. వసంతవాడ సుందరయ్యనగర్‌లో 50 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకూ వరద సహాయం అరకొరగానే అందింది. గుంపన్నగూడెం గ్రామం ముంపులో ఉండగా ఆ గ్రామాన్ని 45.72 కాంటూరులో చేర్చారు. ఇక్కడ 50 కుటుంబాలు ఉండగా వరద సాయం సక్రమంగా అందని పరిస్థితి ఉంది. మద్దిగట్లగూడెం గ్రామాన్ని సైతం 45.72 కాంటూరులో చేర్చడంతో ఆ గ్రామస్తులు లబోదిబోమంటున్నారు. గ్రామంలో 160 కుటుంబాలకుగాను 50 కుటుంబాలకే పరిహారం అందింది. ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్న వారికి కూడా నష్టపరిహారం అందించలేదు. నిర్వాసితులకు పునరావాస కాలనీ పూర్తిస్థాయిలో నిర్మించలేదు. నడిమికొమ్ము గ్రామంలో 22 దళిత కుటుంబాలు ముంపులో ఉండగా 41.15 కాంటూరులో చేర్చాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సర్వే నెంబర్ 385లో సుమారు 60 ఎకరాలు ఉన్నప్పటికీ భూ పరిహారం ఇవ్వలేదు. గ్రామంలో గిరిజనేతరులకు నిర్వాసిత కాలనీ సైతం నిర్మించలేదు. తోటగొమ్ము గ్రామంలో 97 కుటుంబాలు ఉండగా 25 కుటుంబాలకే వరద పరిహారం అందించారు. గిరిజనేతరులకు ఇళ్ల పట్టాలు, ఇతర సాయం ఏదీ అందించలేదు. ఈ గ్రామస్తులకు నిర్మించిన పునరావాస కాలనీలో ఎటువంటి సౌకర్యాలూ కల్పించలేదు. ఆసుపత్రి కాలనీ గ్రామాన్ని సైతం 41.15 కాంటూరులో చేర్చాల్సి ఉన్నప్పటికీ చేర్చలేదు. ఇక్కడ వరద పరిహారంగాని, గిరిజనేతరులకు పరిహారంగాని ఇవ్వలేదు.

కన్నాయిగుట్ట గ్రామంలోనూ ఇదే పరిస్థితి. పడమటమెట్ట గూడెంలో ఊరు మొత్తం మునిగినా 45.72 కాంటూరులో చేర్చడం అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. 200 కుటుంబాలు ఉండగా వంద కుటుంబాలకే ఆర్థిక సాయం అరకొరగా అందింది. నిర్వాసిత కాలనీ ఏర్పాటు జరగలేదు. తాట్కూరుగొమ్ము కాలనీ, వసంతవాడ ఇలా అనేక గ్రామాల్లో పునరావాస పరిహారం గాని, భూములకు పరిహారం గాని ప్రభుత్వం ఇప్పటికీ అందించలేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే జులైలో మళ్లీ వరదలు వస్తే తమ పరిస్థితి ఏమిటా అని వారంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. తమ మండలంలోకొచ్చిన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్ర బృందానికి సమస్యలపై వినతులు అందించి న్యాయం చేయాలని కోరారు.

నేడు యాత్ర సాగేదిలా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం పోరుకేక మహాపాదయాత్ర మూడో రోజు బుధవారం మండలంలోని కామయ్యపాలెం నుంచి వంకావారిగూడెం, మడకంవారిగూడెం, కాలనీలు, జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం కాలనీలు మీదుగా జీలుగుమిల్లి మండలంలోని కొరుటూరు కాలనీలకు చేరుకుని రాత్రి బస చేయనుంది.


పోలవరం ఉపయాత్ర పోలవరంలో బయల్దేరి ఇటుకలకోట, వింజరం, కాలనీలు, దొండపూడి మీదుగా కోండ్రుకోట కాలనీ చేరుకుని రాత్రి బస చేయనుంది.

నేడు పోలవరం నుంచి పోరుకేక ఉపయాత్ర

పోలవరం: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఎం ఆధ్వర్యాన పోలవరం పోరుకేక ఉపయాత్ర బుధవారం పోలవరంలో ప్రారంభమవుతుందని, దీనిలో నిర్వాసితులంతా పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్రను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి) ప్రారంభిస్తారని తెలిపారు. సిపిఎం జిల్లా నాయకులు కె.శ్రీనివాస్ నేతృత్వంలో ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. పార్టీలకు అతీతంగా అంతా నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సాగే పాదయాత్రను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ యాత్ర గురువారం సాయంత్రం బుట్టాయగూడెం చేరుకుని నెల్లిపాక నుంచి ప్రారంభమైన మహాపాదయాత్రలో కలుస్తుందని వివరించారు.

'జగనన్న సురక్ష'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


తహాశీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. మంగళవారం ఆయన మండలంలోని చిన ఆగిరిపల్లిలో వాలంటీర్లు నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ఇంటింటి సర్వేను నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌తో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం జులై ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకూ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు ఫోన్ నెంబరు అనుసంధానం, సిసిఆర్‌సి కార్డులు వంటి 11 రకాల సేవలు ఎటువంటి రుసుమూ లేకుండా ఉచితంగా అందజేస్తారన్నారు. ఆయా గ్రామాల్లో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్‌ను గ్రామ సచివాలయాల నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. అనంతరం ఆయన జగనన్న సురక్ష ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. వరహా పుష్కరిణి వద్ద జరుగుతున్న పనులను, వడ్లమాను గ్రామంలో జగనన్న ఇళ్ల కాలనీల్లో పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.వెంకటరత్నం, తహాశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు, ఎంపిడిఒ పి.శంకరరావు, హౌసింగ్ ఎఇ అలీముల్లా, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై సర్వత్రా ఆగ్రహం

ప్రజాశక్తి - విలేకరులు

విద్యుత్ భారాలతో జనం విలవిల్లాడుతున్నారు. రకరకాల ఛార్జీలు విధించడంతో ఎన్నడూ లేనివిధంగా బిల్లులు మోతమోగుతున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా నానాఅవస్థలు పడుతున్నారు. భారీమొత్తంలో బిల్లులు కట్టలేక సతమతమవుతున్నారు. దీంతో పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో అప్రకటిత విద్యుత్‌కోతలు విధించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసినప్పటికీ బిల్లులు మాత్రం అధికంగా ఎలా వచ్చాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. చిరువ్యాపారులు, నిరుపేద కుటుంబాలు తీవ్రఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్ బిల్లులు పెంచడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం దృష్టిసారించి విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

పావులూరి దుర్గాప్రసాద్, సెలూన్ షాపు, ముదినేపల్లి



విద్యుత్ బిల్లులు, షాపు అద్దెలతో జీవనం కష్టంగా మారింది. గతనెలలో రూ.350 బిల్లు వచ్చింది. జూన్ నెలలో రూ.700 వచ్చింది. ఒక్కసారిగా మూడు ఇంధన సర్దుబాటు ఛార్జీలను బిల్లులో కలపడంతో విద్యుత్ బిల్లుల ఛార్జీలు పెరిగాయి. పెరిగిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి.

విద్యుత్ బిల్లులు భారం దారుణం

మొవ్వ ఫణీంద్ర, వైఎస్ఆర్ కాలనీ, పెయ్యేరు ముదినేపల్లి మండలం



విద్యుత్ బిల్లులు భారంగా మారాయి. గతంలో రూ.500 నుంచి రూ.900 వచ్చేది. జూన్ నెల రూ.2302 వచ్చింది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే ప్రజల ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుంది. ఈ పరిస్థితుల్లో ప్రజలపై భారాలు మోపడం సరికాదు. పెంచిన విద్యుత్ భారాలు ఉపసంహరించాలి.


ఉన్నతాధికారులకు చెప్పినా ఫలితం లేదు

మానుకొండ నాగార్జున, ల్యాబ్ టెక్నిషియన్, జంగారెడ్డిగూడెం

అద్దె గదిలో ల్యాబ్ నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాను. ప్రతినెలా విద్యుత్ బిల్లు రూ.వెయ్యి నుండి రూ.1200 వరకూ వచ్చేది. కాని జూన్ నెలలో విద్యుత్ బిల్లు రూ.6800 రావడంతో ఖంగుతిన్నాను. విద్యుత్ మీటరు సమస్య ఉందనే అనుమానంతో స్థానిక లైన్‌మెన్‌కు సమస్య తెలియజేశాను. ఆయన వేసవి రీత్యా విద్యుత్ బిల్లు ఎక్కువ వస్తుందని తెలిపారు. అయినప్పటికీ విద్యుత్ బిల్లు అధికంగా రావడం గురించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని సరిపెట్టారు. ఒకవైపు విద్యుత్ కోతలతో ఉపాధి కోల్పోతుంటే మరోవైపు విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో ఇబ్బందులు పడుతున్నాము.

కూలీనాలీ చేసుకునే వాళ్లపై భారాలు దారుణం


టి.సతీష్, జంగారెడ్డిగూడెం



కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తుంటాను. ఈ నెల కరెంటు బిల్లు రూ.నాలుగు వేలు వచ్చింది. ఎలా కట్టాలో అర్థంకావడం లేదు. ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నాగాని బిల్లులు మాత్రం షాక్‌కు గురిచేస్తున్నాయి. ఈ సమస్య గురించి విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేసినా ఫలితం లేదు. దీంతో గత రెండు నెలలుగా జీవనం కష్టంగా సాగుతుంది.

ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలి

ఎస్‌కె.మాబూసుభాని, డివైఎఫ్ఐ పట్టణ కమిటీ సభ్యులు, జంగారెడ్డిగూడెం



ప్రభుత్వం అడ్డగోలుగా ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న ఆర్థిక భారాన్ని రద్దుచేయాలి. జీవనోపాధి కష్టంగా మారిన నేటి రోజుల్లో ప్రజలకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల భారం వేయడం సరికాదు. సామాన్యులపై ఆర్థికభారాలు మోపకుండా సరైన పాలన చేపట్టాలి.

30న భీమవరంలో పవన్ బహిరంగ సభ

నేడు, రేపు ముఖ్యనేతలతో సమావేశం

మూడు రోజులపాటు భీమవరంలోనే జనసేనాని బస

పార్టీ నిర్మాణం, రాష్ట్ర రాజకీయాలపై చర్చ

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

ఈ నెల 30న భీమవరంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ సభ నిర్వహించనున్నారు. స్థానిక అంబేద్కర్ చౌక్‌లో భారీస్థాయిలో సభ నిర్వహించాలనే యోచనలో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం, గురువారం ముఖ్య నేతలతో పవన్ సమావేశం కానున్నారు. మూడు రోజులపాటు భీమవరంలోని పవన్ బస చేసి పార్టీ నిర్మాణం, రాష్ట్ర రాజకీయాలపై చర్చలు జరిపి కీలక నిర్ణయాలు తీసుకుని ప్రకటనలు చేయనున్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో జనసేన వారాహి విజయయాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రధానంగా ఉభయగోదావరి జిల్లాలపై కేంద్రీకరించిన జనసేనాని తూర్పుగోదావరి జిల్లా అన్నవరం నుంచి ఈ నెల 14న వారాహి యాత్ర ప్రారంభించారు. కత్తిపూడి, పిఠాపురం, కాకినాడ, ముమ్మిడివరం, అమలాపురం, మలికిపురంలో పర్యటన చేసి బహిరంగ సభలు నిర్వహించి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రవేశించారు. నరసాపురంలో బహిరంగ సభ ముగించుకుని జనసేనాని భీమవరం చేరుకున్నారు. సోమవారం తూర్పుకాపుల సంఘం సభలో పవన్ పాల్గొని మాట్లాడిన అనంతరం జనసేన ఇన్‌ఛార్జీలతో రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. దీనిలో ప్రధానంగా భీమవరంలో రాజకీయపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నేతలు సూచించారు. ఈ నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఈ నెల 30న సాయంత్రం ఐదు గంటలకు భీమవరం అంబేద్కర్ సెంటర్లో వారాహి విజయయాత్రలో భాగంగా బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ సభలో ప్రసంగిస్తారని, ఈ సభ చాలా ముఖ్యమైనదిగా భావించాలని దిశానిర్దేశం చేశారు. బహిరంగ సభ అనంతరం వారాహి విజయ యాత్రకు స్వల్ప విరామం ఇస్తామన్నారు. అనంతరం రెండో దశ వారాహి విజయ యాత్రపై చర్చించారు. ప్రధానంగా రూట్ మ్యాప్, జిల్లాలో ఏయే ప్రాంతాల్లో వారాహి యాత్ర సాగించాలనే దానిపై చర్చలు జరిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావుతోపాటు జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కుష్టుపై ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - పోలవరం

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం బెస్తవీధిలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యసిబ్బంది ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం పోశమ్మ, ఆశా వర్కర్లు గోకా అరుణకుమారి పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్యబృందం పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఢిల్లీకి చెందిన ప్రత్యేక వైద్య బృందం పలు విభాగాలను మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ మాట్లాడుతూ డాక్టర్ అజయ్ కుమార్‌సూద్, డాక్టర్ జీను జి.తామస్ నేతృత్వంలోని బృందం లక్ష్య సర్టిఫికేషన్ కార్యక్రమంలో భాగంగా అన్ని విభాగాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో ఆయిల్‌పామ్ మొక్కలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఆయిల్‌పామ్ మొక్కలు కావాల్సిన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి ఎస్.రామ్మోహన్ సూచించారు. మంగళవారం నూజివీడు ఉద్యానవన శాఖ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం తొమ్మిది నర్సరీల్లో 10 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలను జూలై నుంచి రైతులకు కోసం సిద్ధం చేశామని ఆయన తెలిపారు. రైతులకు బిందు సేద్య పరికరాలను కూడా రాయితీపై అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతిరోజూ విద్యార్థులు వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఎంఇఒ బివి.సుబ్బారావు తెలిపారు. మంగళవారం మండలంలోని జ్ఞానలోప వికలాంగుల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హెచ్.అన్నామణి ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఎంఆర్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డిఎంఎల్‌వి.లక్ష్మి నారాయణ, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

సత్యం ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన వంట సామగ్రిని అందించిన సత్యం ఫౌండేషన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుల్లి రాజు, ఉపాధ్యాయులు శరీన్, పరమానందం అభినందించారు. మంగళవారం ఎంపిపి పాఠశాల-4లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీకి సామగ్రిని అప్పగించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం పాఠశాల విద్యార్థులకు అధునాతన సౌకర్యాలు కల్పనలో భాగంగా బెంచీలు, బల్లలను అందజేశారని, ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న ఏజెన్సీకి వంట సామగ్రి అందించడం అభినందనీయమన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

శ్రీఅన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాధికారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరంలో జరిగిన వివిధ క్రీడల ఎంపిక పోటీల్లో అండర్ 14 బాలురు విభాగంలో గోపు విజయ్ కుమార్, బొకినాల కిరణ్, గొట్టిపాటి మణికంఠ, అండర్-14 బాలికల విభాగంలో జయశ్రీ అనూష, కతారి పల్లవి, గంటా జాహ్నవి ఎంపికైనట్లు తెలిపారు. వచ్చేనెల ఒకటి, రెండు తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా తునిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు మల్లేశ్వరి, కృష్ణవేణి, కోటేశ్వరమ్మ, సౌజన్య, మనోహరం, పుల్లారావు, బాలు, విఠల్ బాబు, నాన్ టీచింగ్ సిబ్బంది ధనలక్ష్మి, విద్యా కమిటీ ఛైర్మన్ పల్లగాని వెంకటేశ్వరరావు, క్రీడాకారుల ఫిజికల్ డైరక్టర్ పి.రవీంద్ర అభినందించారు.

30న చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఉంగుటూరు

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ రైతుసంఘం నాయకులు కైకరంలో గోడ పత్రికను మంగళవారం విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో జూన్ 30న చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని శోభనాపురంలో గోడ పత్రికను విడుదల చేశారు.

'స్కిల్‌హాబ్'తో యువతలో నైపుణ్యం

ప్రజాశక్తి - చింతలపూడి

నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంచేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ హబ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ ఎఎస్‌వి.కృష్ణ మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటిఐ, చింతలపూడి అసోసియేటివ్ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి, అనంతరం ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి ఈనెల 30 వరకూ దరఖాస్తులు స్వీకరించాబడతాయని, శిక్షణ అనంతరం ఉపాధి కల్పించేందుకు కొన్ని పరిశ్రమల యాజమాన్యాలతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ పూర్తిచేసి ఖాళీగా ఉన్న యువతీ యువకులను గుర్తించి వారికి స్కిల్ హబ్‌లో శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. 30 ఏళ్ల లోపు వారికి మూడు నెలల కోర్సును అందిస్తామని, ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేయడం ద్వారా అద్దెల భారం తప్పిందని తెలిపారు. దీనిపై సిబ్బందికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారన్నారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కార్తిక్(9000803414)ను సంప్రదించాలని కోరారు.

'అట్లూరి' సేవలు అభినందనీయం

నూజివీడు రూరల్: రాజకీయాలకు అతీతంగా అట్లూరి ఛారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో అట్లూరి వెంకట నరేంద్ర జయంతిని పురస్కరించుకొని ట్రస్ట్ నిర్వహించిన ఉచిత కంటి శిబిరాన్ని ముద్దరబోయిన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్రస్ట్ వ్యవస్థాపకులు అట్లూరి వెంకట నరేంద్ర పేదల కోసం చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముసునూరు రాజా, ఏలూరు పార్లమెంట్ తెలుగు యువత నాయకులు గోగినేని మధు కిరణ్ , నియోజకవర్గ టిఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షులు తట్టుకోల శివ నాగరాజు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తునికి బొరగం సాయం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సీతప్పగూడెం పంచాయతీలోని కట్టుపల్లి గ్రామానికి చెందిన పాయం సుబ్బారావు ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో మంగళవారం నియోజకవర్గ కన్వీనర్, టిడిపి నేత బొరగం శ్రీనివాసులు ఆయన స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.6,000 ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సున్నం నాగేశ్వరరావు, నియోజవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం రామకృష్ణ, కుమ్మర ముక్కయ్య, బిర్రం నాగభూషణం, చోడెం అర్జున్ పాల్గొన్నారు.

హుండీల చోరీ

చాట్రాయి: ఆరుగొలనుపేట, జనార్ధనవరం రామాలయం, తుమ్మగూడెం రామాలయం, ఆంజనేయస్వామి దేవాలయాల్లో మంగళవారం రాత్రి దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఆలయ హుండీలను పగలగొట్టి నగదును అపహరించుకుపోయారు. ఒకే రాత్రి మూడు గ్రామాల్లోని చోరీ జరగడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ఎస్ఐ కె.ప్రతాపరెడ్డి ఆలయాలను పరిశీలించి కేసు నమోదు చేశారు.

15 ఏళ్లుగా నరకయాతన..!

సా..గుతున్న పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీల నిర్మాణం

నేటికీ పూర్తికాని పరిస్థితి

నామమాత్రంగా మౌలిక వసతులు

జీవనోపాధి లేక అవస్థలు

అద్దె ఇళ్లల్లో మగ్గుతున్న పలు కుటుంబాలు

అసంపూర్తిగా తాడువాయిలో నిర్మాణాలు



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

'పోలవరం ప్రాజెక్టు కోసం ఉన్నఫళంగా గ్రామాలను ఖాళీ చేయమన్నారు.. లేకుంటే బలవంతంగానైనా తరలిస్తామని అధికారులు బెదించారు.. మా కోసం అన్ని వసతులతో పునరావాస కాలనీలు నిర్మించామని చెప్పారు.. కానీ ఇప్పటికి 15 ఏళ్లు అవుతుంది. మాకు కేటాయించిన ఇళ్లు ఎక్కడ ఉన్నాయో కూడా కొందరికి తెలియడం లేదు. ఏళ్ల తరబడి దిక్కుతోచని స్థితిలో పునరావాసం కోసం ఎదురు చూస్తున్నాం. పూర్తయిన ఇళ్లల్లోకి వస్తే కనీస వసతుల్లేక నరకయాతన అనుభవిస్తున్నాం. కనీస వసతుల్లేవు. రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు పూర్తిస్థాయిలో నిర్మించలేదు. ప్రభుత్వం స్పందించి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి' అంటూ పోలవరం నిర్వాసితులు వేడుకుంటున్నారు.

మండలంలోని తాడువాయి పంచాయతీ చల్లావారిగూడెంలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కాలనీ ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం నెలకొంది. ఇక్కడ 3905 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటి వరకూ 2452 ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేశారు. మిగతా ఇళ్లల్లో 411 ఇళ్లు బేస్‌మెంట్ పూర్తయ్యాయి. బేస్‌మెంట్ లెవిల్‌లోపు 462, శ్లాబు వరకూ నిర్మించినవి 568, అసలు ప్రారంభం కాని ఇళ్లు 12 ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మొత్తంగా 62 శాతం మాత్రమే నిర్వాసిత కాలనీ ఇళ్లు పూర్తయినట్లు వెల్లడవుతుంది. సుమారు 15 ఏళ్లుగా పునరావాస ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న నిర్వాసితులు ముంపుప్రాంతాల నుండి ఎక్కడికి వెళ్లాలో తెలియక దిక్కుతోచని స్థితిలో సతమతమవుతున్నారు. అనేకమంది నిర్వాసితులు తమకు కేటాయించిన ఇళ్లు ఎక్కడున్నాయో తెలియని గందరగోళం నెలకొంది. వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం మండలాల నిర్వాసితులకు చల్లవారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో ఇళ్లను కేటాయించారు. ఈ క్రమంలో నిర్మాణాలు పూర్తయిన ఇళ్లలోకి వేలేరుపాడు, పోలవరం మండలాల నుండి సుమారు 500 కుటుంబాలు చేరుకున్నాయి. కానీ కాలనీవాసులకు మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. ఇళ్ల చుట్టూ గ్రావెల్ నింపకపోవడంతో చిన్నపాటి వర్షానికి కాలనీలోకి నీరుచేరుతోంది. వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. జీవనోపాధి కల్పించకపోవడంతో నిర్వాసితులు దిక్కుతోచని స్థితిలో కాలంగడుపుతున్నారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణం కూడా అసంపూర్తిగానే చేపట్టారు. బలవంతంగా గ్రామాలను ఖాళీ చేయించి కాలనీకి పంపారని నిర్వాసితులు వాపోతున్నారు. చింతూరు మండల నిర్వాసితులకు కేటాయించిన ఇళ్లల్లో గందరగోళం నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. వారికి కేటాయించిన ఇళ్లకు సంబంధించి ఇంటి నెంబర్లతో కూడిన పత్రాలున్నప్పటికీ మరోచోట ఇళ్లను చూపుతున్నారని అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వచ్చిన గోదావరి వరద ముంపునకు గురైన తమ బంధువులు సర్వం కోల్పోయినప్పటికీ పునరావాస ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో అద్దె ఇళ్లల్లో కాలం గడుపుతున్నామని మరికొందరు నిర్వాసితులు వాపోతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం సరైన పరిహారం అందించడం, ఉపాధి కల్పన, మౌలిక వసతులు, విద్యా, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారు తీవ్రఅసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీవనోపాధి కరువైంది

ఉమాసంతూషి, పోలవరం నిర్వాసితురాలు

పునావాస కాలనీలో నివాసం ఉంటున్న నిర్వాసితులకు జీవనోపాధి కరువైంది. ఏ పని చేసుకుని బతకాలో అయోమయంగా ఉంది. కాలనీ సమీపంలో వ్యవసాయ పనులు కూడా దొరకడం లేదు. మా పిల్లల భవిష్యత్తు ఆందోళనకరంగా ఉంది. ప్రభుత్వం దృష్టిసారించి కాలనీవాసులకు జీవనోపాధి కల్పించాలి.

రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలి

కె.రమణ, వేలేరుపాడు మండలం కరుటూరు నిర్వాసితుడు

పునరావాస కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి. కొంతమేర మాత్రమే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. వర్షం వచ్చినప్పుడు నడిచేందుకు ఇబ్బంది పడుతున్నాము.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

బండి రాంబాబు, కుక్కునూరు మండల నిర్వాసితురాలు

పునరావాస కాలనీలో వీధి దీపాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి. రాత్రి సమయంలో విషసర్పాలు సంచరిస్తున్నాయి. త్వరితగతిన వీధి దీపాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలి.

ఇళ్ల ప్రాంగణంలో గ్రావెల్ నింపాలి


బి.వీరబాబు, కుక్కునూరు మండల నిర్వాసితుడు

పునరావాస కాలనీల ఇళ్ల చుట్టూ గ్రావెల్ మట్టిని నింపాల్సి ఉంది. ఇళ్లల్లోకి వచ్చి ఏడాది దాటింది. కానీ ఇప్పటివరకూ ఇంటి చుట్టూ మట్టిని నింపే చర్యలు చేపట్టలేదు. అధికారులను అడుగుతున్నా స్పందించడం లేదు.

18 ఏళ్లు నిండిన వారికి రూ.10 లక్షలు ఇవ్వాలి

ఎస్‌కె.హన్ను, వేలేరుపాడు మండల నిర్వాసితుడు

18 ఏళ్లు నిండిన వారికి రూ.పది లక్షలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. కాలయాపన చేయకుండా ప్రభుత్వం దృష్టిసారించి పరిహారం అందించాలి.



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

మానవత సేవల విస్తరణకు కృషి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మానవత సంస్థ సేవలను మారుమూల గ్రామాలకు తీసుకెళ్లే విధంగా కృషి చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. మండల కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం రాత్రి నారాయణపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు రామిశెట్టి మాట్లాడుతూ ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చుకుని సేవలను విస్తరించేలా ప్రతిసభ్యుడూ నూతన కమిటీకి సహకరించాలన్నారు. కార్యక్రమానికి వేగేశ్న సూర్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా గంజి రవి, ఉపాధ్యక్షులుగా ముళ్లపూడి కృష్ణమోహన్, కార్యదర్శిగా పిల్లా రామకృష్ణ, కోశాధికారిగా కేవీ నాగేంద్రకుమార్, సహాయ కార్యదర్శిగా కెవివి.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా పాండ్రాకుల శ్రీనివాసరావు, తమ్మిన శ్రీనివాసరావు (యర్రమిల్లిపాడు సర్పంచి), కంభంపాటి సూరిబాబు, నేదూరి గంగాధరరావు బాధ్యతలు చేపట్టారు. నూతన కమిటీని పలువురు అభినందించారు. కార్యక్రమంలో మానవత విస్తరణ అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకి రామరాజు, రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపీ పాల్గొన్నారు.

వాలంటీరు పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

జంగారెడ్డిగూడెం: పురపాలక సంఘ పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు వాలంటీరు పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ పి.భవానిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పోస్టుల భర్తీకి బిసి-బి మహిళ1, ఎస్‌సి మహిళ-1, ఎస్‌టి మహిళ-1, ఒసి-1 కేటగిరిల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. అర్హత కలిగినవారు వచ్చేనెల రెండో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రతిభా విద్యార్థులకు బహుమతులు

పోలవరం: గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. మొదటి బహుమతిగా రూ.మూడు వేలు, రెండో బహుమతి రూ.రెండు వేలు, మూడో బహుమతిగా రూ.వెయ్యి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల కెవి.రాఘవన్, విద్యా కమిటీ ఛైర్మన్ వీరపరాజు సత్యనారాయణ, నాగమణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.సునీలారెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు పుస్తకాలు, బ్యాగులు, షూలు, యూనిఫారాలు, రాగిజావ, మధ్యాహ్న భోజనం వంటివి అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగుల నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరి, రత్నమాల, శ్రీదేవి, జాన్సీ, వాణి, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ప్రధానోపాధ్యాయులు జి.ప్రసాద్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అనేక పథకాలను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని తద్వారా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు మరింత అభివృద్ధి సాధించేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ సమావేశంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ శానం లక్ష్మణరావు, వైస్‌ఛైర్మన్ చోడే జ్యోతి, పేరెంట్స్ కమిటీ సభ్యులు కె.నాగరాజు, కె.సత్యనారాయణ, నూలు మంగ, బగాతి అంజిబాబు పాల్గొన్నారు.

నూజివీడు నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు డిపో నుంచి అరుణాచలం పౌర్ణమి గిరి ప్రదక్షణకు వెళ్లే భక్తులకు ఆర్‌టిసి మంగళవారం శుభవార్త చెప్పింది. జూలై 1 న నూజివీడు నుంచి అరుణాచలంకు సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సు నడుపుతామని డిపో మేనేజర్ పవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బస్సు అరుణాచలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, వేలూరు ఆలయాల దర్శనార్థం ఏర్పాటు చేశామని, రూ.2,600 ఛార్జీతో స్పెషల్ బస్సు నడుపుతున్నామని తెలిపారు. ఈ బస్సుకు అధికారిక వెబ్సైట్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని అన్నారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని ప్రదర్శన

ప్రజాశక్తి - కుక్కునూరు



తహశీల్దార్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాల నిర్వాసితులకు తక్షణం పునరావాసం కల్పించి, పరిహారం చెల్లించాలని, పోడు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ మాట్లాడుతూ గతేడాది వచ్చిన గోదావరి వరదలకు నష్టపోయిన బాధితులకు నేటికీ పరిహారం ఇవ్వలేదని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, కె.ప్రసాద్, ఎం.లక్ష్మయ్య, ఆదయ్య, గంగరాజు, ముత్తమ్మ, భీమరాజు పాల్గొన్నారు

జగనన్న సురక్షను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - భీమడోలు

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై వాలంటీర్లకు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాలంటీర్లు చేపట్టాల్సిన మార్గదర్శకాలను అంశాల వారీగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వాహణ కోసం భీమడోలు మండలంలో రెండు టీములను ఏర్పాటు చేశామన్నారు. వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల సమస్యలను నమోదు చేసుకోవాలన్నారు. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేలా వారికి అవసరమైన డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు అందజేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి, గృహ నిర్మాణ సంస్థ ఎఇ సతీష్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ పాల్గొన్నారు.

పోలవరం : జగనన్న సురక్ష కార్యక్రమం వచ్చేనెల ఒకటో తేదీ నుంచి 14 వ తేదీ వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించబడుతుందని తహశీల్దార్ బి.సుమతి తెలిపారు. మంగళవారం గూటాల సచివాలయంలో వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ జివివి.సత్యనారాయణ మాట్లాడుతూ వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రజల అవసరాలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీను, ఎఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు, ఇఒపిఆర్‌డి ఇఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తాతి విజయ కుమారి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ముసునూరు: జగనన్న సురక్ష పథకాలపై ప్రతిఒక్క అధికారి అవగాహన కలిగి ఉండి గ్రామ ప్రజలకు తెలియజేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సూచించారు. మంగళవారం మండలంలోని సూరేపల్లి, లోపుడి గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వేపై విస్తృతంగా పర్యటించారు. సచివాలయ సిబ్బందికి, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందికి, వాలంటీర్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఎంపిడిఒ జి.రాణి ఇఒపిఆర్ డి.బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ సాయిరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ప్రతీఇంటికి వెళ్లీ నవరత్నాలపై సర్వే నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. మంగళవారం మండలంలోని లోపూడి, సూరేపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష పథకంపై సర్వే నిర్వహించి నవరత్నాల అందాల్సిన వారికి అందేలా చర్యలు చేపడతారన్నారు.

చాట్రాయి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చనుబండ సచివాలయం-1లో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 12 రకాల సర్టిఫికెట్లు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందిస్తున్నామన్నారు. అనంతరం ఎస్‌సి కాలనీలో ఉన్న లే అవుట్లను పరిశీలించారు. అసిస్టెంట్ ఇంజనీర్ జె.శ్రీనివాస్‌ని పిలిచి ఇల్లు రాని వారికి ఇంటికి సంబంధిత అప్లికేషన్లు తీసుకొని ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె.దుర్గాప్రసాద్, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు, ఇఒపిఆర్‌డి.నాగరాజు, సచివాలయ సిబ్బంది, సర్పంచి వి.జ్యోతి,ప్రజలు పాల్గొన్నారు.

ఉంగుటూరు: గ్రామ వాలంటీర్లు అంకిత భావంతో పనిచేయాలని నారాయణపురం ఎంపిటిసి సభ్యులు బండారు నాగరాజు అన్నారు. మంగళవారం నారాయణపురం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం గ్రామ వాలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టి వాలంటీర్లకు సముచితమైన స్థానం ఇచ్చారన్నారు. కానీ గ్రామాల్లో కొందరు వాలంటీర్లు ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారన్నారు. ప్రభుత్వ సేవలు పూర్తిస్థాయిలో ప్రతీ కుటుంబానికి అందించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జె.నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు మత్తుకుమల్లి శ్రీధర్, బండారు సురేఖ నాగరాజు, మూర్తి, శ్రీపాని బాలు, పెంటా రామకృష్ణ, కరుణ కుమారి, వాలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని ఎంపియుపి పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు బ్యాగులు, షూస్, యూనిఫారాలు, పుస్తకాలు, బెల్టులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కె.స్వర్ణలత, ఎంపిటిసి-1 రుద్ర సూర్య కళా వెంకట శివాజీ, ఎంపిటిసి-2 పెద్దిరెడ్డి రమ్య కుసుమ నాగేశ్వరావు, టౌన్ ప్రెసిడెంట్ ఉక్కుర్తి వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జగన్‌కు గుణపాఠం తప్పదు'

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజలను మభ్యపెడుతూ పాలనసాగిస్తున్న సిఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. రమణక్కపేట గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తానని మోసపూరిత హామీలిచ్చారన్నారు. జగన్‌లా కాకుండా టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోను తూచా తప్పకుండా అమలు చేస్తామని, చంద్రబాబు ప్రకటించిన తొలి మేనిఫెస్టో ప్రజాదరణతో పాటు మహిళాధరణ పొందుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దేవినేని డేలరామ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదో తేదీలోపు రేషన్ పంపిణీ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండల, పట్టణ పరిధిలోని రేషన్ డీలర్లు విధిగా ఐదో తేదీలోగా లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం పట్టణ, మండల పరిధిలోని డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు.

In The Court Of The Hon'ble Vth Additional Junior Civil Judge :: Kakinada
O.S.No. 53/2020

Between:
Penkey Venkata Srinivasarao ...*Plaintiff*
AND
Marumalla Venkateswara Rao and another ...*Defendants*

TO:
Marumalla Venkateswararao, S/o. Not Known, aged about 50 yrs, Business, C/o. Satya Durga Agencies, Opp. Sivalayam, Palakollu, W.G.Dist.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.21-07-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం.జవహర్ ఆలీ
అడ్వకేట్, డో.నెం.25-6-11,
గంజాం వారి వీధి, కాకినాడ.
సెల్: 98483 07906

In The Court Of The Ist Additional Junior Civil Judge :: Tanuku
O.S.No. 194/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ...*Plaintiff*
VS
Midde Kumari another ...*Defendant*

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) మిద్దే కుమారి, భర్త: నారాయణ, హిందువు, స్త్రీ, 66 సం॥లు, వ్యవసాయం, డో.నెం.10-52బి, ఆలమూరు, పెనుమంట్ర మండలం.
2) వేముల సుబ్బలక్ష్మి, భర్త: చిరంజీవి, హిందువు, స్త్రీ, 57 సం॥లు, బి.సి.ట్యాంకు వీధి, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.28-06-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

T.RAMA DEVI
Advocate, Tanuku.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారి కోర్టులో
E.P.No. 261/2005
in O.S.No. 74/1999

బిట్వీన్:
M/s. శ్రీరామ్ చిట్స్ (P) Ltd., ఏలూరు ...*డిక్రీ హోల్డర్*
అండ్
1) హబిబున్నిసా
2) అబ్దుల్ సత్తార్
3) పూర్ణ బహదూర్ ...*జడ్జిమెంట్ డెటార్స్*

పై నెంబరు గ్రంథములో డిక్రీ బాకీ వసూలు కొరకు జె.డి.ఆర్స్ సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములో గల ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది. 13-07-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట భహిరంగ వేలం వేయుదురు.** కాబట్టి యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకొనవచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.

షెడ్యూలు 1వ అయిటం:
పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు సబ్ రిజిస్ట్రారు ఇలాకా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, 19వ వార్డు, డో.నెం. 14-6-7, టి.ఎస్.నెం. 711 గల 104 చదరపు గజముల నివేశన స్థలంకు హద్దులు: ***తూర్పు:*** జార్జ్ గారి ఇల్లు స్థలము. ***దక్షిణం:*** రోడ్డు. ***పడమర:*** జాయింటు గోడ. ***ఉత్తరం:*** రోడ్డు. ఈ హద్దుల మధ్య చ॥గ॥లు 104 వేలం వేయుదురు.

డి.హెచ్.ఆర్. విలువ : రూ.50,000/-
అమీనా విలువ : రూ.27,500/-

ఈ.శ్రీనివాసబాబు
అడ్వకేట్, 2వ రోడ్డు,
ఏలూరు, ఎన్.జి.ఓ.కాలనీ, అమీనాపేట,
27-6-23. ఏలూరు. సెల్: 94401 88498